కవితా కౌముది

# ఇద్దరు

వారాల ఆనంద్

ఇద్దరు
ఒకరిని ఒకరు పలకరించుకోవడం
ఎంత బాగుంటుంది
చూపులతో నయినా
రెండు మాటలతో నయినా

లేత కిరణాలు
ఆకులనీ పువ్వుల్నీ పలకరించినట్టు
+++
ఇద్దరూ
ఒకరిని ఒకరు తెలుసుకోవడంలో
ఎంత వెలుగుంటుంది
సుఖం లోనూ దుఖం లోనూ
విజయం లోనూ ఓటమిలోనూ

ఇసుక తిన్నెల పైన
నీటి దారాలు అల్లినట్టు
+++
ఇద్దరూ
ఒకర్ని ఒకరు ప్రేమించుకోవడం
ఎంత హాయిగా వుంటుంది
నిద్దట్లోనూ మెలకువలోనూ
కలల్లోనూ అన్ని కాలాల్లోనూ

కెరటాలు ఉప్పొంగి
ఆర్తిగా తీరాన్ని తాకినట్టు
+++

ఇద్దరూ
ఒకర్ని ఒకరు  ఓదార్చుకోవడం
ఎంత ధీమాగా వుంటుంది
ఒంటరైనప్పుడూ ఓడిపోయినప్పుడూ
నిలబడలేనప్పుడూ కూలిపోయినప్పుడూ

ఎండిన గుండెల్లో
తడేదో కురిసినట్టు
+++

ఇద్దరూ
ఒకరి కోసం ఒకరు ఎదురు చూడడం
ఎంత ఆర్తిగా వుంటుంది
చీకట్లోనూ వెలుతురులోనూ
స్నేహంలోనూ మోహంలోనూ

సూర్యుడు చంద్రుడి కోసం
చంద్రుడు సూర్యుడు చూసినట్టు

***



# ఉన్న పళంగా బి.వి.వి.ప్రసాద్

చేయబోయే ప్రయాణం కన్నా
తయారయే సమయం ఎక్కువైనట్టు
గమ్యంలో గడిపే కాలం కన్నా
ప్రయాణం బహు దీర్ఘమైనట్టు
నిండుగా బతికే క్షణాల కన్నా
బతికే ఏర్పాట్లకే కాలం కరిగిపోతోంది!
తల్లి ఒడిలో కూర్చుని
తప్పిపోయానని ఏడ్చినట్టు
ఇప్పటిలోని సుఖాన్ని పొందటానికి
ఎప్పటికో ప్రణాళికలు వేస్తాము
ఇక్కడిలోని భద్రత కనుగొనటానికి
ఎక్కడెక్కడికో సంచరిస్తాము!
నేను, నువ్వు, తాను
మూడు జీవితాలు
నీకు లేనట్టుగానే ఎవరికీ లేవు!!
నిన్న, నేడు, రేపు
మూడు కాలాలు
ఇప్పుడుకి లేనట్టే ఎప్పుడూ లేవు!!
పొడవూ, వెడల్పు, లోతు
మూడు కొలతలు
ఇక్కడకి లేనట్టే ఎక్కడా లేవు!!

ఉన్నది నువ్వే ఇప్పుడే ఇక్కడే

ఉన్నపళంగా చనిపోయినట్టు
ఉన్నపళంగా జీవించి చూడాలి
ఉన్నపళంగా స్పృహ తప్పినట్టు
ఉన్నపళంగా మెలకు వైపోవాలి

★★★

## ఆ రోజులు
## సునీల్

తన నయన నీడన నేద తీరుతున్న
నీలి రంగును చూసి అబ్బురపడిన రోజులు.

వీణ తీగలు పేర్చిన తన స్వరము నుండి జాలువారే తన
మాట పాట కోసం ఎదురు చూసిన రోజులు.

నిగూఢంగా తన కనురెప్పల చప్పుడులో ఉన్న
సంగీతాన్ని ఆస్వాదిస్తూ గడిపిన రోజులు.

తన కురుల నలుపు జేరితే
ఇంద్రధనస్సు ఇంకెంత అందంగా ఉంటుందో
ఊహిస్తూ గడిపిన రోజులు.

తన నుదిటిన వెలుగుతున్న జ్యోతిలా ఉండే
తిలకపు వెలుగును చూస్తూ మైమరిచిన రోజులు.

వెన్నెల ప్రోవులు పేర్చినట్లుండె తన చెక్కిళ్ళను చూసి
వెన్న మృదువా? తన చెక్కిలి మృదువా?
అని సందిగ్ధపడ్డ రోజులు.

ఆ రోజులు తలచిన ప్రతిసారి తెలుస్తుంది
గతం ఎంత అందమైనదో..!!

★★★



## ఎడబాటు
## సుధాకర్ క్రొవ్విడి

కందిన చెక్కిళ్ళకి తెలుసు
సరుగుడుచెట్ల తోటల్లో సాయంత్రాల అల్లర్లు -
కలసిన పెదవులకి తెలుసు
సుధామాధుర్య రహస్యాల వల్లర్లు -
అలసిన కళ్ళకి తెలుసు
కోర్కెల మోహపు రాత్రుల కథలు -
దూరమైన మనసులకి తెలుసు
విషాదపు విరహాల వ్యథలు

★★★

## గుర్తుండే వుంటుంది
## ఆర్.ఎస్.వెంకటేశ్వరన్

నేనెప్పుడు ఒంటరినయ్యానో
నీకు గుర్తు వుండే వుంటుంది
అది నీవు చేసిన నిర్ణయమేనని
నీకు గుర్తు వుండే వుంటుంది!
ఎన్నో వెలుగు పువ్వులు తీసుకుని
నేను కలుసుకోవటానికి రావటం
నీకు గుర్తు వుండే వుంటుంది!
చూపులు అన్నివైపులా పరచి
నా కనుదోయి రాల్చిన కన్నీరు
నీకు గుర్తు వుండే వుంటుంది!
చేతుల్లోంచి పిచ్చిగాలి లాక్కున్న
నా లేఖ నీ పాదాల చెంత రాలడం
నీకు గుర్తు వుండే వుంటుంది.!!

★★★

## హృదయవాదీ..!
### లక్ష్మీరాధిక

మబ్బుకమ్మిన జాబిలమ్మకు
అదో మంద్రపు భయం..
ఒంటరిగా చలిపొద్దులోకి జారిన వైనాన
గుండెలో ఒక్కసారిగా మొదలైన నిర్విరామ fusion

లబ్ డబ్..లబ్ డబ్
టు..టు..టు..పి..పి..పి..
ఊ..ఊ..ఊ..రంగ్ రంగ్ రంగ్..
అదో ప్రకృతి భీభత్సపు అలజడి..
A sort of restless chaos

అపస్వరాల పొలిమేరలో
ఆగినట్టున్న భారమైన శ్వాసలోకి
నీ ఆగమనం.. OMG..is that you ?!
హృదయవాదీ..నా మీద అలిగావనుకున్నా..
అరచేతి వెచ్చదనంలో సద్దుమణిగిన ప్రాణం

హఠాత్తుగా ఊపిరికి ఊహలొచ్చి మొదలైన
Lucid Dreams..
కొత్త చిగురులేస్తున్న క్షణాల సాన్నిహిత్యం
క్షేత్రయ్యకే అందని ఓ సుకుమార లాలిత్యం

నా కన్నుల్లోకి చిరునవ్వులొంపుతూ
హత్తుకున్నది నువ్వేనంటే నమ్మలేకున్నా
అరణ్యంలోనూ బీరపువ్వులు పుడతాయని నీకు
తెలుసేమో
కనుకే..
నా ఎదిప్పుడో కోయిలై.. కూజితమైంది

★★★

## స్వరూప సత్యం
### అల్లూరి గౌరీలక్ష్మి

నిజాన్ని పట్టుకోవడం కష్టాల్లో కెల్లా పెద్ద కష్టం
చూసే కన్నుకు మసకల్లేని పారదర్శకతుండాలి
గ్రహించే మెదడుకు ఎంత స్వచ్ఛత కావాలి ?
వెనుక స్పందించే హృదయమెంత నిర్మలమవ్వాలి ?

ఆ మూడూ ముప్పేట సత్యంగా రూపు దాల్చితేనే కద
గొప్ప కళా రూపం సహజంగా ఉద్భవించేది !
జనావళి బతుకుల్లోని వెతలను వెతికి పట్టి
నేటి ప్రశ్నకొక పరిష్కారం నువ్వు చెబితేనే కద
నీ కలానికి సత్యస్ఫూర్తి గౌరవం దక్కేది !

బాధితులకు ఆత్మస్థైర్యపు ఊపిరులూది దిక్సూచిలా
రేపటి వెలుగు దారి చూపితేనే మరి నువ్వు ఋషి వయ్యేది
నీ కథో, కవితో, గేయమో, గీతమో కావ్యమయ్యేది !
అప్పుడేగా అది కాలం దాటి అజరామరమయ్యేది !

★★★



# రసరేఖలు శ్రీధర్ బచ్చోటి

గట్టిగా పాడితిని నాదు గళము విప్పి
వేయి లోలోని భావముల్ వెలికి రాగ
గుండె లోపలి గొంతుకల్ ఘోష పెట్ట
ఎదను దాగిన ప్రేమ పై కెగసిపోవ

గళము విడి పాట బయటకు కదలిపోయి
గాలితరగలలో తాను కలసిపోయె
ఎచటికేగినదంచు చింతించుచుందు
వెదకుచుందును గగనంపు వీధులెల్ల

రాగమది నాదు హృదయాంతరంగమందు
నిండి రాగమై వెలువడి నింగికెగసె
కనులు ముకుళించి హృదయపు కనులు తెరచి
కనుగొనగ వినగనిపుడు కలలు కందు

ఎచటికేగితి చెలియ! నన్నిచట వదలి
నాదు ప్రాణమునాత్మయు నా మనస్సు
నన్నియును తోడులేనివై యున్నవిచట
రాగమిటనుండజాలక సాగెనెటకొ

ఎగిరిపోయిన నా పాట యెచటికేగు
వెదకి కనుగొనుననురాగసదనమొకటి
ఏది యా నిలయమని యూహించుచుంటి
స్పష్టమిపుడయ్యె నీ మొగసాల యంచు

COMMENTS